

# అత్తగారూ - అంబుజం పెళ్ళీ!



- డాక్టర్. భానుమతీ రామకృష్ణ

ఆ రోజు మా అత్తగారి పుట్టింటి వేపు బంధువులు తిరుపతి నుండి దిగారు. వాళ్ళు ఏం పని మీద వచ్చారో మా అత్తగారు తెలుసుకోడానికి ఆమె కూతురు వరసయ్యే ఆండాళ్ళమ్మనీ, ఆమె భర్తనీ కుశలప్రశ్నలు వేస్తూ అడిగారు! ... ఆండాళ్ళమ్మ కూతురు అంబుజం లోపలికి రాకుండా వరండా లోనే గోడకానుకుని గుడ్లు మిటకరించి చూస్తూ నిలబడి వుండడం చూసి "అదే మిటే ఆండాళ్ళూ! అది నీ కూతురు అంబుజం గదూ?" అని అడిగారు మా అత్తగారు.

"అవును కక్కే!" అన్నది ఆండాళ్ళమ్మ నీరసంగా కుర్చీలో కూలబడుతూ -

"అదేమిటే, అక్కడే నిలబడ్డావ్ అంబుజం! లోపలికి రా! చిన్నప్పుడెప్పుడో చూశా! పది పదిహేనేళ్ళయింది" ... అంటూ మా అత్తగారు అంబుజం దగ్గరకెళ్ళి "ఏమే మనవరాలా! తిరుపతి లడ్డూ తెచ్చావా?" అంటూ గుడ్లు మిటకరించి తననే చూస్తున్న అంబుజం దగ్గరకు వెళ్ళారు మా అత్తగారు.

"ఇదుగో తీసుకో!" అంటూ మా అత్తగారి చెంప అదిరిపోయేట్టు చాచి కొట్టింది అంబుజం!

ఆ దెబ్బకు హడలిపోయిన మా అత్తగారు పళ్ళు లేని చెంప పట్టుకుని "ఓయమ్మో! ఇదేం పిల్లే. దయ్యపిల్ల. ఏమైందే దీనికి..." అంటూ బాధతో పక్కనే వున్న సోఫాలో కూలబడ్డారు.

మా అత్తగార్ని కొట్టినందుకు కోపంలో అంబుజాన్ని దబ్బేట్టు రెండు బాది "మేం నీ చేతుల్లో రోజూ తింటూనే వున్నాం! పెద్దామెను కొట్టావే పాపిష్టి దానా! దీని రోగం ఎప్పుడు నయం అవుతుందో కక్కే! దీని చేతుల్లో అందరం చావుదెబ్బలు తింటున్నాం!" అన్నది ఆండాళ్ళమ్మ కండ్లు తుడుచుకుంటూ...

అది విన్న మా అత్తగారు "అవునూ దీనికేం జబ్బే! దయ్యం గియ్యం పట్టిందా ఏం ఖర్మ!" అన్నారు.

"అదేం కాదు కక్కే! అంబుజానికి హిస్టీరియా!" అన్నది ఆండాళ్ళమ్మ

"ఎట్టాగూ? మరి దీని 'హిస్టరీ' జబ్బుకి మందులేం యిప్పించలేదా!" అని మా అత్తగారు హిస్టీరియాని హిస్టరీలో కెక్కించారు!

"ఇప్పించాం కక్కే! కాని ప్రయోజనం లేకుండా వుంది. పెళ్ళి చేస్తే తగ్గచ్చన్నారు డాక్టర్లు కొందరు."

"ఓయమ్మ! దీన్నెవడు చేసుకుంటాడే. నోట్లో పళ్ళు లేని వాడు చేసుకోవాల్సిందే! ముందు దీని దెబ్బకు తట్టుకొనేవాడు దొరకాలే! ముందు ఒక భూతవైద్యుణ్ణి పిలిపించి ఏమంటాడో చూద్దాం!" అన్నారు మా అత్తగారు, ఆండాళ్ళమ్మ కంట తడి పెట్టుకోడం చూసి బాధపడుతూ.

"భూతం గాదూ, దయ్యం గాదూ అత్తయ్యా. దీనికి షాక్ ట్రీట్‌మెంట్ ఇప్పించాలన్నారు డాక్టర్లు" అన్నాడు అంబుజం తండ్రి.

"ఆ షాకూ లేదూ, షోకూ లేదు. నేసిలాంటివి భూతవైద్యుడు నయం చేశాడని విన్నాను!" అన్నారు మా అత్తగారు.

"అదంతా పాతకాలం చాదస్తం" అని అంబుజం తండ్రి విసుగ్గా తలపట్టుక్కూర్చున్నాడు.

"ఏమోనండీ. కక్కే చెప్పినట్టు ఒకసారి భూతవైద్యుడికి పిల్లని చూపిద్దాం!" అన్నది అంబుజం తల్లి మా అత్తగారి తృప్తి కోసం.

"ఏమో! మీ ఇష్టం" అంటూ పైన ఉత్తరీయం వేసుకుని బయటికెళ్ళారు అంబుజం తండ్రి.

మా ఇంటికి దగ్గర్లోనే వున్న భూతవైద్యుడు పీరాన్ సాయిబుకి మా అత్తగారు కబురుపెట్టారు.

పీరాన్ సాయిబు వయసులో పెద్దవాడూ, చాలా నిదానస్తుడూ. అందరూ ఆయన్ని మంచి వాడంటారు. భూత వైద్యంలో చాలా పేరు సంపాదించాడు పీరాన్ సాయిబు!

పీరాన్ సాయిబుగారు వస్తూనే మా హాల్లో వున్న వేంకటేశ్వరస్వామి ముందు తన చెప్పులు వదిలాడు. అది చూసిన మా అత్తగారి మనసు చివుక్కుమన్నది. అయినా పీరాన్ సాయిబు మంచివాడు, పైగా అంబుజం రోగం కుదరడం ముఖ్యంగనక కిక్కురుమనకుండా పీరాన్ సాయిబు చెప్పులు బయట వరండాలోకి తోసిపడెయ్యమని మా పనివాడికి సౌంజ్ఞ ద్వారా చెప్పారు మా అత్తగారు.

అంబుజం వున్న గదిలోకి పీరాన్ సాయిబును తీసుకెళ్ళారు మా అత్తగారు. అంబుజాన్ని చూసి పీరాన్ సాయిబు ఎంతో ఆప్యాయంగా "క్యా బేటీ! క్యా తకరార్!" అని దగ్గరకెళ్ళి అడిగాడు. పీరాన్ సాయిబు చెంప ఛెళ్ళుమనిపించింది అంబుజం. తక్షణం పీరాన్ సాయిబు బుగ్గ బూరెలా ఉబ్బింది. మా అత్తగారు గాబరాతో తన చెంప సరిచేసుకోడం చూసి నవ్వాపుకొన్నాను.

అంబుజం దెబ్బకు కాస్త ఖంగుతిన్న పీరాన్ సాయిబు కాస్త తేరుకుని "బేటీ! నువ్వు కొట్టలేదు! నీ మీద వున్న సైతాన్ కొట్టింది! ... నీకు నేను మందు ఇవ్వను! అల్లాకి ప్రార్థనా చేస్తాను" అంటూ కింద కూర్చుని కళ్లు మూసుకుని ఏవో మంత్రాలు వాళ్ళ భాషలో మెల్లిగా చదువుతూ చేతిలో వున్న నెమలి ఈకల కుంచె అంబుజం తల మీద వుంచాడు.

తక్షణం అంబుజం పీరాన్ సాయిబు కుంచెలో వుండే నెమలి ఈకలన్నీ చెడామడా పీకి పారేసింది. పీరాన్ సాయిబు ముఖం కాస్త వెలవెలపోయినా వెంటనే సర్దుకుని, లేచి "హమ్మాగారూ! ఈ అమ్మాయికి బడా ఖత్తార్ నాక్ సైతాన్ పట్టి వుంది. ఈ అమ్మాయి చేతులూ, కాళ్ళూ కట్టేవేస్తేనే మంత్రం పని చేస్తాది! నే వస్తాను. ఈ తాయెత్తు ఈ అమ్మాయి పడుకునే జాగాలో పెట్టండి. నేను రేపూ వస్తాను హమ్మాగారూ!" అంటూ వెళ్ళిపోయాడు పీరాన్ సాయిబు.

"ఏంట్రా ఏదో కత్తెర నక్క భూతం అంటున్నాడు పీరాన్ సాయిబూ!" అన్నారు మా అత్తగారు.

"కత్తెర నక్కా గాదు, గాడిద గుడ్డూ గాదు. దీనికి 'షాక్ ట్రీట్‌మెంట్' డాక్టర్ ధైర్యం దగ్గర ఇప్పిస్తే మంచిదంటున్నారు అందరూ" అంటూ అంబుజం తండ్రి లోపలికొచ్చాడు.

"వచ్చిన వాళ్ళందర్నీ కొట్టే రోగం ముందు వదిలించాలి. ఈ దయ్యానికి ఒళ్ళు కొవ్వెక్కి ఇట్లా చేస్తోంది. ఇంక ఎవర్నీ కొట్టవుగదా" అంటూ అండాళ్ళమ్మ కూతురు అంబుజాన్ని చచ్చేట్టు బాదడం చూసి మా అత్తగారు దగ్గరకెళ్ళి ఆపబోయి తక్షణం అంబుజం కొట్టిన చెంప దెబ్బ గుర్తొచ్చి దూరంగా నిలబడే "అయ్యో పాపం. కొట్టకే అండాళ్ళూ! పోనీ నువ్వన్నట్టు దానికి పెళ్ళి చేస్తే రోగం కుదుర్తుందేమోలేవే. నాకేమో ఇది భూతం, దెయ్యంగా కనిపించడం లేదు" అన్నారు పీరాన్ సాయిబు వల్ల కాలేదని గుర్తించిన మా అత్తగారు.

"దీన్ని ఎవరు చేసుకుంటారు అత్తయ్యా! దీని పిచ్చి కుదిర్తే గదా పెళ్ళి చేయడానికి."

"పెళ్ళిచేస్తే పిచ్చి కుదుర్తుందేమో" అన్నారు మా అత్తగారు.

"కక్కీ! నా కూతురు పెళ్ళి బాధ్యత మీరే తీసుకుని దాన్ని ఒక దారికి తీసుకురావాలి. మీ కాళ్ళు పట్టుకుంటాను... ఒక్కగానొక్క కూతురు. అందుకే మీ దగ్గరకి తీసుకువచ్చాను" అంటూ అండాళ్ళమ్మ మా అత్తగారి చేతులు పట్టుకుని కళ్ళనీళ్ళు పెట్టుకోడంతో మా అత్తగారు అంబుజం పెళ్ళి బాధ్యత అమాంతం తన తల మీద వేసుకున్నారు.

అండాళమ్మ కన్నీరు తన చీర కొంగుతో తుడుస్తూ, "అబ్బే దీనికింత బెంబేలు పడతావెందుకే! దానికి పెళ్ళి సమ్మంధం నేను చూస్తానే! నువ్వు నిశ్చింతగా వుండు" అంటూ అండాళ్ళమ్మ వీపు తట్టి ధైర్యం చెబుతుంటే, అంబుజం తండ్రి, "దీన్ని ఎవరు చేసుకోడానికి ముందుకొస్తారత్తయ్యా! మీ పిచ్చిగాని."

"ఎవరో ఎందుకు రావడం! మన శఠగోపంగాడున్నాడుగా!" అన్నారు మా అత్తగారు చిర్నవ్వుతో.

"శఠగోపం అంటే..." అని అంబుజం తండ్రి ప్రశ్నార్థకంగా చూశాడు మా అత్తగారి వైపు.

"అదేరా. మన భాష్యం కొడుకు!"

"ఓ! ఆ బండ వెధవా! మరీ వాడికి పొట్ట పొడిచినా'అక్షరం ముక్క రాదుటగా! ...పైగా వాడికి నత్తిగూడా వుందన్నారు! ఎప్పుడూ పార్థసారధి గుడిముందు కూర్చుని బటాణీలు తింటూ అచ్చోసిన ఆంబోతులాగా తిరుగుతుంటాడని విన్నాను. పైగా వాడికి పిచ్చిపట్టిందన్నారే!"

"ఆ! అదంతా ఒట్టిదిరా. కాస్త పిచ్చి వాలకంగా, వెకిలిగా ఊరికే హి హి హి హి అని నవ్వుతూంటాడు! అంతమాత్రం చేత పిచ్చివాడంటే ఎట్లా? బోలెడు ఆస్తి వుందిరా. వాడొక్కడే కొడుకు భాష్యానికి! వాడికి పెళ్ళి చేస్తే బాగవుతాడని అంటున్నారు! చాలా సమ్మంధాలు చూశారు!"

"ఎవరూ చేసుకోనన్నారు! అంతేనా? వాణ్ణెవరు చేసుకుంటారు వెకిలి వెధవ!" అన్నాడు అంబుజం తండ్రి విసుగ్గా సోఫాలో కూర్చుంటూ.

మా అత్తగారూ సర్దిచెప్పబోయారు.



"ఛా ఛా! మన పిల్ల రోగంతో ఇలాగే వున్నా ఫర్వాలేదుగాని ఆ వెకిలి వెధవకి చూస్తూ చూస్తూ ఎట్లా ఇచ్చేది" అని మొండికెత్తాడు అంబుజం తండ్రి.

"భేషుగ్గా ఇవ్వచ్చు. ఇదిగో అల్లుడూ! ఊరికే భేషజాలు పలకవాక! ఇట్లాంటివాళ్ళంతా పెళ్ళయ్యాక చిలకా గోరింకల్లా వున్నారు. నీ కూతురుకి ఆ భాష్యంగాడి కొడుకు శఠగోపం తప్ప వేరే వరుడు వెంటనే దొరకడు! నే రాసిస్తా!" అన్నారు మా అత్తగారు ఛాలెంజ్ చేస్తూ!

అండాళ్ళమ్మకి మా అత్తగారు చెప్పింది నచ్చింది. "ఏమండీ! రేపే ఆ పిల్లవాణ్ణి వెళ్ళి చూద్దామండీ" అంటున్న అండాళ్ళమ్మతో –

"ఎందుకే మీరెళ్ళి చూడ్డం! వాళ్ళని మనింటికే పిలిపిస్తాను. పాపం భాష్యం పిల్లవాడి పెళ్ళి దిగులుతో సగం అయ్యాడు! ఇక వాడి పెళ్ళాం చూడి సంగతి చెప్పక్కర్లే! అసలే రోగిష్టిది! పిల్లవాడి పెళ్ళి చేసి చూడాలని ఆశ పాపం.

"ఆ వెకిలి వెధవకి పెళ్ళొక్కటే తక్కువ!"

"నీ కూతురికంటే శఠగోపంగాడేం చెడిపోలేదులే! గంతకు తగ్గ బొంత! అందుకే వాడికిచ్చి చేస్తే వాడి పిచ్చీ, దీని పిచ్చీ కుదరచ్చనే చెబుతున్నా! – బోలెడు ఆస్తి! ఆలోచించు" అన్నారు మా అత్తగారు.

"ఎట్లాగత్తయ్యా! చూస్తూ చూస్తూ వాడికివ్వడం! రేపు పిల్లకి రోగం నయమైతే వాడితో నేను కాపురం చెయ్యనంటే! కాస్త చదువుకున్నదాయె మా పిల్ల!"

"నువ్వు చెప్పేది తర్వాత మాటరా! ముందు పెళ్ళయ్యాక దీని దెబ్బలతో వాడు దోవకొస్తాడేమో ఎవరు చెప్పగలరు. అది దోవకొస్తే వాడ్నీ దోవకు తెచ్చుకుంటుందేమో! ఏడు తరాలకి సరిపడే ఆస్తి!"

"అవునండీ, కక్కి చెప్పింది వినండి! పెళ్ళయితే ఇద్దరి రోగం కుదరచ్చుగా. ఉన్నపళంగా మన పిల్లను ఎవరు చేసుకుంటారు చెప్పండి!"

"మీ ఇష్టం – ఏమైనా చెయ్యండి" అంటూ బయటకు వెళ్ళిపోయాడు అంబుజం తండ్రి చిరాకుపడుతూ.

మర్నాడు పెళ్ళిచూపులకు తిథి, వారం, నక్షత్రం బాగుందని మా అత్తగారు పంచాంగం చూసి పిల్లవాడి తండ్రి భాష్యంగారి ఇంటి నెంబరు తిప్పి ఫోన్ చెయ్యమన్నారు. మా అత్తగారు భాష్యంగారితో అన్ని విషయాలూ చెప్పి మర్నాడు ఎన్ని గంటలకు పిల్లని చూడ్డానికి పిల్లవాడితో రావాలో చెప్పేశారు!

పెద్ద జమకాణా వేసి పండ్లూ, పూలూ, ఫలహారాలు మధ్యలో పెట్టించారు మా అత్తగారు అంబుజం పెళ్ళిచూపుల కోసం!

పెళ్ళిచూపులకు శఠగోపానికి పట్టు పంచ, సిల్కు చొక్కా వేసి, పట్టెనామాలు పెట్టి తండ్రి తీసుకొచ్చాడు. వెనకనే శఠగోపం తల్లి చూడమ్మ వచ్చి తన మెళ్ళో చంద్రహారం తీసి కొడుకు శఠగోపం మెళ్ళో వేసి మా అత్తగారి వేపు చూసింది!

"ముద్దుగా వున్నాడే! పిచ్చి వెధవకి పెళ్ళికళ వచ్చేసింది" అంటూ మురిసిపోయారు మా అత్తగారు.

అంబుజానికీ అలంకారం చేసి తీసుకొచ్చారు. చుట్టూ నలుగురైదుగురు పెద్దవాళ్ళు తప్ప ఎవరినీ పిలవలేదు మా అత్తగారు.

అంబుజాన్ని చూస్తూనే వెకిలి నవ్వు నవ్వుతూ, "ఈ పిల్లేనా నా పెళ్ళాం" అంటూ శఠగోపం వెళ్ళి అంబుజం పక్కన కూచున్నాడు.

శఠగోపాన్ని చూసి అంబుజం పిచ్చిగా పకపక నవ్వడం చూసి మా అత్తగారు సంబరపడిపోతూ, "ఇద్దరూ చూడ ముచ్చటగా వున్నారు గదే చూడీ!" అన్నారు చూడమ్మతో.

తనకి పెళ్ళి కాబోతోందనే సంతోషంతో శఠగోపం వెకిలిగా నవ్వుతూ నవ్వుతూ ఒళ్ళు మరచి అంబుజం తొడ మీద చిన్నగా కొట్టాడు! తక్షణం అంబుజం శఠగోపం చెంప ఛెళ్ళుమనిపించింది. శఠగోపం ఏడుపు ముఖంతో, "అమ్మా! చూడే! ఈ అమ్మాయి నన్ను కొడుతోంది!" అన్నాడు.

ఇలాంటి సమయాల్లో మా అత్తగారు తెలివిగా తప్పుకుంటారు. "సరేసరే! ఇక హారతీ, దృష్టీ తియ్యాలి. ఇద్దర్నీ లోపలికి పిల్చుకురండి" అంటూ హడావిడిగా లోపలికెళ్ళారు మా అత్తగారు.

చుట్టూ వున్న నలుగురు పెద్దలూ పేరంటాళ్ళూ, "మంచి జోడీయే!" అంటూ నవ్వుకుంటూ వెళ్ళారు.



హారతి ఇస్తుంటే అంబుజం వెలిగే కర్పూరాన్ని ఊది ఆర్పేసింది. "ఏమ్! ఎందుకు ఆర్పేశావ్?" అన్నాడు శఠగోపం అధికారం చెలాయిస్తూ.

"నా ఇష్టం! నువ్వెవర్రా బోడి వెధవ నన్నడగడానికి!" అని అంబుజం అంటూంటే శఠగోపం తల్లిదండ్రులు అయోమయావస్థలో ఒకరి ముఖం ఒకరు చూసుకోవడం గమనించిన మా అత్తగారు, "అదేంటే చూడీ! పిల్లకు తెచ్చిన నగలన్నీ దానికి చూపించూ" అంటూ వాళ్ళ మూడ్ మార్చడానికి ప్రయత్నించారు.

నగలన్నీ చూడమ్మ తెచ్చి అంబుజం ముందుంచింది. "హాయ్! ఇవన్నీ నేనే వేసుకుంటా" అంటూ పళ్ళెంలో వున్న వడ్డాణం తీసి మెళ్ళో వేసుకుంది. "అట్లా కాదమ్మా! వడ్డాణం నడుముకి పెట్టుకోవాలి" అంటూ అంబుజం నడుముకు వడ్డాణం పెట్టబోయి భయంతో వెనక్కి తగ్గింది చూడమ్మ, అంబుజం ఎక్కడ కొడుతుందో అన్న భయంతో.

అంబుజం అన్ని నగలూ వేసుకుని రవ్వల కమ్మలు చెవులకు పెట్టమని చూడమ్మనడిగింది! చూడమ్మ సంతోషపడిపోతూ కాబోయే కోడలికి కమ్మలూ, జూంకీలూ పెట్టింది! ... అందంగా కనిపించిన అంబుజాన్ని చూసి అంబుజం తల్లిదండ్రులు ఆనందంతో కండ్లు తుడుచుకున్నారు!

శఠగోపం పళ్ళెంలో వున్న పదార్థాలు తింటూ ఒంటినిండా నగలు పెట్టుకున్న అంబుజాన్ని చూసి, "ఏయ్ నువ్వు పెట్టుకున్నవన్నీ మా అమ్మ నగలు! ఇచ్చెయ్" అంటూ అంబుజం మెళ్ళో వున్న కాసులపేరూ, పలకసర్లూ పట్టుకు లాగాడు!

శఠగోపం తల్లి చూడమ్మ ఖంగారుపడ్తూ, "ఒరేయ్ నాయనా! ఆ నగలు నేనే ఇచ్చారా! నీ పెళ్ళాం కదా ఈ అమ్మాయి! మనం నగలు పెట్టాలిగా" అని శఠగోపాన్ని వెనక్కి లాగింది, అంబుజం మళ్ళీ ఎక్కడ కొడుతుందో అనే భయంతో.

పెళ్ళాం అనే మాట విన్న శఠగోపం వెకిలిగా నవ్వుతూ నోట్లో వేలేసుకుని "నగలన్నీ నువ్వే వేసుకో. నువ్వు నా పెళ్ళానివిగా" అన్నాడు సిగ్గుపడుతూ!

అది విన్న అంబుజం "ఛీ పో" అంటూ కొట్టబోయింది. చటుక్కున శఠగోపం తల్లి అడ్డొచ్చి, "తప్పమ్మా! కొట్టకూడదు" అని ఆపింది.

కాని అంబుజం చీటికీ మాటికీ కొడుతుంటే కొడుకేమైపోతాడో అన్న దిగులుతో చూడమ్మ మా అత్తగారితో "అత్తయ్యా! పిల్ల అందర్నీ కొట్టడం కాస్త భయంగానే వుంది! ముందు కాస్త ఆ పిల్లకి ట్రీట్‌మెంట్ ఇప్పించి అందర్నీ కొట్టడం మాన్పిస్తే మంచిదేమో" అని చూడమ్మ పూర్తిచేయక ముందే మా అత్తగారందుకుని, "నీకేం మతిపోయిందంటే చూడీ! అంబుజానికుండే 'హిస్టరీ' జబ్బు కుదిరిందంటే నీ కొడుకుని చేసుకుంటుందా అది! నీ కొడుక్కి ఈ జన్మలో పెళ్ళి అవుతుందా! అందుకని ఇది మంచి అదును అనుకొని రేపే ముహూర్తం పెట్టించాను" అది విన్న చూడమ్మ, ఆమె భర్త శఠగోపం పెళ్ళి అయితే చాలనీ, ఒక వంశాంకురాన్ని చూడాలని ఉబలాట పడుతున్నారు గనుక మా అత్తగారి మాటకు ఎదురుచెప్పలేకపోయారు.

మర్నాడు పెళ్ళికి మా అత్తగారు ఎవరికీ శుభలేఖలూ, పిలుపులూ లేకుండా ఇంట్లోనే చిన్న పెళ్ళిమంటపంలాంటిది ఏర్పాటుచేయించారు. పెళ్ళిపీటల మీద అంబుజం ఎవరినీ కొట్టకుండా సగం నిద్రమాత్ర ఇప్పించారు మా అత్తగారు డాక్టర్ సలహాతో.

అంబుజం ఆవలిస్తూ తల్లి ఆండాళ్ళమ్మను ఆనుకుని పెళ్ళిపీటల మీద కూర్చుంది. శఠగోపానికీ వెకిలి నవ్వు నవ్వకుండా సగం నిద్రమాత్ర వేయించింది మా అత్తగారు. పెళ్ళి మంత్రాలు క్లుప్తంగా చదవమనీ, త్వరగా తాళిబొట్టు కట్టించే ఏర్పాట్లు చేయాలనీ పురోహితులతో ముందే మా అత్తగారు చెప్పినందువల్ల పది నిమిషాల్లో మాంగల్యం తంతునా అంటూ పురోహితుడు తాళిబొట్టు శఠగోపం చేతికిచ్చి పెళ్ళికూతురి మెళ్ళో కట్టమన్నారు. తల్లిని ఆనుకుని సగం నిద్రలో వున్న అంబుజం మెడ తల్లి మెడకానుకుని వున్నందువల్ల సగం నిద్రావస్థలో వున్న శఠగోపం అంబుజం మెడకీ, అంబుజం తల్లి మెడకీ చేర్చి తాళిబొట్టు కట్టబోయాడు.

"ఛీ ఛీ ఇదేంటి పీడా!" అంటూ ఆండాళ్ళు వెనక్కి తప్పుకుంది, అంబుజం వెనక్కి పడకుండా భుజాలు పట్టుకుని.

పురోహితుడి సాయంతో గట్టి మేళం మేళగాళ్ళు వాయిస్తుంటే అంబుజం మెళ్ళో తాళి కట్టాడు శఠగోపం.

మా అత్తగారు తృప్తిగా నిట్టూర్పు విడిచి, "ఇక లేవండి. టిఫిన్లు తిందురు గాని" అంటూ అంబుజం తల్లిదండ్రుల్నీ, శఠగోపం తల్లిదండ్రుల్నీ, మిగతా కొద్దిమంది పేరంటాళ్ళనీ లోపలికెళ్ళమని తొందర చేసింది.

ఒక కంట పన్నీరు, ఒక కంట కన్నీరు స్థితిలో వున్న పిల్లా పిల్లవాడి తల్లిదండ్రులు మా అత్తగారు చెప్పిందంతా యాంత్రికంగా చేస్తూ పోవడం కనిపించింది. వచ్చిన పేరంటాళ్ళు రాత్రి పిల్లనీ, పిల్లవాణ్ణీ గదిలోకి పంపే ఏర్పాట్లు చేయడం మొదలెట్టారు.

నిద్ర మాత్రల మత్తు వదలని శఠగోపం, అంబుజాలు ఇద్దరూ సోఫాల్లోనే గుర్రుపెట్టి నిద్రపోతూండడం చూసిన పేరంటాళ్ళు వాళ్ళని గదిలోకి ఎలా పంపడం అని నవ్వుకోవడం మొదలెట్టారు.

రాత్రి కాస్త నిద్రమత్తు తగ్గాక అంబుజానికీ, శఠగోపానికీ భోజనాలు పెట్టించారు.... భోజంచేసి చెయ్యి కడుగుతూనే "అమ్మో నాకు నిద్ర వస్తోందే!" అన్నది అంబుజం. "గదిలోకి వెళ్ళి పడుకో" అంటూ అంబుజాన్ని గదిలోకి పంపారు. శఠగోపాన్నీ లోపలికి పంపి బయట గడియ పెట్టారు.

అంబుజానికీ, శఠగోపానికీ టీవీ చూడ్డం అంటే చాలా ఇష్టం అని తెలిసిన పేరంటాళ్ళూ తెలివిగా తెలుగు పిక్చర్ కేసెట్ వేసి టీవీ ఆన్ చేసి తలుపేశారు.

వాళ్ళనుకున్నట్లే టీవీలో కలర్ పిక్చర్ రావడంతో అంబుజం, శఠగోపం సంతోషంతో చప్పట్లు కొడుతూ పక్కపక్కనే కూర్చుని జాలీగా టీవీ చూడ్డం కిటికీ సందుల్లోంచి పేరంటాళ్ళు చూసి దారిలో పడ్డారని సంతోషపడిపోతూ ఎవరి దోవన వారు పోయారు.

నెలలు గడిచిపోయాయి. ఒక రోజు అంబుజం తల్లి ఆండాళ్ళు సంతోష వార్త చెప్పింది ఫోన్ చేసి మా అత్తగార్కి – ఆస్పత్రిలో అంబుజానికి ఆడపిల్ల పుట్టిందనీ, వెంటనే వచ్చి చూడాల్సిందనీ!

మా అత్తగారు విజయగర్వంతో, "చూడవే! నవ్విన నాపచేనే పండిందంటారే... అంబుజం, శఠగోపం విషయంలో ఆ సామెత నిజమయింది చూశావా" అని నాతో అన్నారు.

అవునన్నట్లు మౌనంగా తలూపాను.

ఇద్దరం అంబుజం ప్రసవించిన ఆస్పత్రికి వెళ్ళాం. కొత్త లేడీ డాక్టరు, నర్సులూ హడావిడిగా అటూ ఇటూ తిరుగుతున్నారు – అంబుజం రూం దగ్గర!

విషయం ఏమిటని అడిగారు మా అత్తగారు అక్కడ హడావిడిగా పోతున్న నర్సుని.

"ఇప్పుడు పుట్టిన పిల్ల ఏడవడం లేదండీ" అంటూ ఆవిడ పెద్ద డాక్టర్ కోసం పరుగెత్తింది.

"ఇదేం విచిత్రమే! పుట్టి భూమ్మీద పడ్డ వెంటనే ఏడవాలి గదా ఏ బిడ్డయినా. అంబుజానికి పుట్టిన బిడ్డ ఏడవడం లేదట్నే" అంటూ అంబుజం వున్న రూంలోకి వెళ్ళింది మా అత్తగారు.

ఆండాళ్ళమ్మ ఆదుర్దాగా "కక్కీ! పుట్టిన బిడ్డ ఏడవడం లేదు. అందర్నీ గుడ్లు మిటకరించి చూస్తూ వుంది" అన్నది.

అది విన్న మా అత్తగార్కి ఏదో బ్రిలియంట్ ఐడియా తట్టి అంబుజం బిడ్డ రెండుకాళ్ళూ పట్టుకుని పైకెత్తి పిర్ర మీద ఒక్క దెబ్బ కొట్టింది! తక్షణం ఆ పిల్ల ఏడవడానికి బదులు, "హి హి హి హి, హి హి హి హి" అని నవ్వడం మొదలెట్టింది. పిల్ల నవ్వడం చూసి తల్లి అంబుజం కూడా నవ్వడం మొదలెట్టింది.

అప్పుడే వచ్చిన లేడీ డాక్టరు, నర్సులూ కూడా ఆ విచిత్రం చూసి ఆశ్చర్యంగా నవ్వడంతో మా అత్తగారు షాక్‌తో ముక్కు మీద వేలేసుకున్నారు.


సంపూర్ణ ఆరోగ్యానికి– శాశ్వత రోగ నివారణకు
ప్రత్యేక చికిత్స– ప్రకృతి చికిత్స

అత్యాధునిక వసతులతో నిపుణులైన డాక్టర్లు మరియు సహాయకులతో ఆహ్లాదకరమైన వాతావరణములో నెలకొల్పబడినది 'రేవతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ నేచురోపతి అండ్ యోగిక్ సైన్సెస్'

సంపూర్ణ ఆరోగ్యము పొందుటకు 3, 7, 11 దినముల శిక్షణ మరియు వైద్యము చేయబడును. పక్షవాతము, ఆస్మా, చర్మవ్యాధులు, రక్తపోటు, దయాబెటిస్, కీళ్ళనొప్పులు, స్థూలకాయము, నరాల బలహీనత, మొలలు, మలబద్ధకము, మానసిక రుగ్మతలు, సెక్సు సమస్యలు, జ్ఞాపక శక్తి పెంచుట, కుటుంబ సమస్యలు, మానసిక ఉల్లాసానికి మరియు దీర్ఘవ్యాధులు నయము చేయుటలో ఇదివరకే వందలాది మంది మా సేవా లబ్ధిని పొందియున్నారు.

ఇక్కడ శాస్త్రబద్ధమైన ఆహార నివాస వసతులతో మసాజ్, హైడ్రోథెరపీ, క్రోమోథెరపీ, పిరమిడ్ థెరపీ, ఫిజియో థెరపీ, సన్‌బాత్, శాండ్‌బాత్, మాగ్నెటిక్ థెరపి, వైబ్రేషన్ థెరపీ, మృత్తికా చికిత్స, నవరత్నములు, స్ఫటిక మరియు రుద్రాక్షములతో చికిత్స, ముఖ్యముగా థెరపిటిక్ యోగా మొ. పద్ధతుల ద్వారా చికిత్స చేయుచున్నాము.

గాలి, నీరు, శబ్దము, ఆహారము వీటి కాలుష్యములను నివారించుటకై మా సంస్థ తగు శ్రద్ధ తీసుకొంటున్నాము.

మా సంస్థలో గౌ. డైరెక్టర్ డా. వి.నాగేష్ ప్రముఖ హిప్నోథెరపిస్టు (హైదరాబాద్) వారు ప్రతి నెల రెండవ శని, ఆది వారాలలో విచ్చేసి మానసిక రోగులకు చికిత్స అందజేయుచున్నారు.

మా సంస్థ రీసెర్చి విభాగం నుంచి తయారైన అన్ని రకముల ఫేస్ ప్యాక్‌లు, హెర్బల్ తైలములు, బాత్ పౌడర్‌లు మరియు టానిక్‌లు లభ్యమగును. (This is for restricted supply only)

యోగా నేర్చుకొనగోరువారు మా యోగా శిక్షణాలయము నందు 15 రో., 1 నెల, 2 నెలలు మరియు 3 నెలలు వరకు శిక్షణను పొందవచ్చును.

ఇచ్చట ప్రతి ఒక్కరికి ఆర్థిక అందుబాటులో వుండునట్లు తక్కువ ఖర్చుతో పూర్తి సేవలను పొందవచ్చును.

సంప్రదించగలరు Ph: 62952

REVATHI NATURE CURE HOSPITAL
GREEN LANDS ESTATE MADANAPALLE

రేవతి ప్రకృతి చికిత్సాలయము
రేవతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ నేచురోపతి అండ్ యోగిక్ సైన్సెస్
గ్రీన్‌ల్యాండ్స్, ఆరోగ్యవరం, మదనపల్లె, చిత్తూరు జిల్లా A.P.


B.N.Reddy